సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం । 19 । జూలై । 2023



ఎల్ఎండీకి 9,320 క్యూసెక్కులు..

బోయినపల్లి: మిడ్‌మానేరు నుంచి ఎల్ఎండీలోకి మంగళవారం సాయంత్రం వరకు 9,320 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉండగా, అంతే మొత్తంలో వరదకాల్వ ద్వారా ఇన్‌ఫ్లో కొనసాగుతుంది.



గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ తిప్పాపూర్ గోశాలలోని 20 కోడెలను మహబూబాబాద్ జిల్లా ఇందుర్తి మండలం మెచరాజీపల్లిలోని మహాలక్ష్మి గోశాలకు అప్పగించారు.

గరిష్టం/కనిష్టం
26.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లాలో ముగ్గురు సీఐల బదిలీ



మొగిలి



వెంకటేశ్



బన్సీలాల్

సిరిసిల్లక్రైం: జిల్లాలో పని చేస్తున్న ముగ్గురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎల్లారెడ్డిపేట సీఐ మొగిలి, వేములవాడ టౌన్ సీఐ ఓ.వెంకటేశ్, వేములవాడ రూరల్ సీఐ బన్సీలాల్ బదిలీ అయిన వారిలో ఉన్నారు. సుదీర్ఘ కాలం పని చేస్తున్న అధికారులు ఎన్నికల సమయంలో బదిలీ అవుతారని ముందుగానే ఊహించనట్లే అధికారులను ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరి స్థానంలో ఎవరినీ పోస్టింగ్ చేశారన్న విషయం ఉత్తర్వుల్లో పేర్కొనలేదు.

ఈవీఎంలపై శిక్షణ



అవగాహన కల్పిస్తున్న అదనపు కలెక్టర్

సిరిసిల్లఅర్బన్: జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆధ్వర్యంలో ఈడీసీ, ఎండీవీ ఇన్‌చార్జీలకు ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక శిక్షకులు కరుణాకర్, అభిషేక్ 20 మంది ఈవీఎం డెమాన్‌స్ట్రేషన్ సెంటర్, మొబిల్ డెమాన్‌స్ట్రేషన్ వ్యాన్ ఇన్‌చార్జీలకు శిక్షణ ఇచ్చి వాటిపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, ఎన్నికల సూపరింటెండెంట్లు ముక్తార్ పాషా, రెహమాన్, సీనియర్ అసిస్టెంట్ అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మిక ఉద్యోగార్థులకు శిక్షణ



సన్మానిస్తున్న ప్రవాసీమిత్ర అవార్డు గ్రహీతలు

ముస్తాబాద్(సిరిసిల్ల): గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి వచ్చిన ఉద్యోగార్థులకు బీసీ స్టడీ సర్కిల్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ప్రవాసీ మిత్ర అవార్డు గ్రహీతలు జనగామ శ్రీనివాస్, పరస తిరుపతి కోరారు. ఈ మేరకు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామిని మంగళవారం వారి గృహంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ, మంత్రి కేటీఆర్ ప్రోత్సాహంతో సిరిసిల్ల ప్రాంత నిరుద్యోగుల కోసం స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేశారన్నారు. అత్యాధునిక వసతులు, స్టడీ మెటీరియల్‌తోపాటు మంచి ఫ్యాకల్టీ ద్వారా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. గల్ఫ్ వెళ్లి వచ్చిన వారికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. ఈసందర్భంగా వెంకటస్వామిని ప్రవాసీమిత్ర అవార్డు గ్రహీతలు సన్మానించారు. మునాఫ్ తదితరులున్నారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

చందుర్తి(వేములవాడ): కేజీబీవీ, యుఆర్ఎస్ సమగ్ర శిక్షణలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈనెల 20న చేపట్టే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ ఆవరణలో కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని మంత్రులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందన్నారు. విద్యాశాఖ మంత్రికి గోడు వెల్లబోసుకోగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి విస్మరించారని వివరించారు. 20న ఉద్యోగులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రావు, ఉపాధ్యక్షుడు అంబటి రమేశ్, కోశాధికారి రవీందర్, శంకర్, కేజీబీవీ ప్రత్యేకాధికారి కల్పన తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల: జిల్లా ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ భవనం సిద్ధమైంది. సిరిసిల్ల, వేములవాడ పాత తాలూకా ప్రాంతాలతో రాజన్న సిరిసిల్ల జిల్లాగా ఆవిర్భవించడం.. రాష్ట్రంలోనే భౌగోళికంగా, జనాభా పరంగా చిన్న జిల్లాగా ఉన్నా.. అభివృద్ధిలో మాత్రం అగ్రస్థానంలో నిలుస్తూ మెడికల్ కాలేజీ ఏర్పాటు అవుతుంది. పట్టణ శివారులోని పెద్దూరు బైపాస్ రోడ్డులో పది ఎకరాల స్థలంలో రూ.40 కోట్లతో మెడికల్ కాలేజీ భవనం, విద్యార్థుల హాస్టళ్ల భవనాలు శరవేగంగా నిర్మాణమవుతున్నాయి. ఆగస్ట్ మొదటి వారంలోగా పనులు పూర్తి కానున్నాయి. రెండో వారంలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం వైద్య విద్య తరగతులకు శ్రీకారం చుట్టనున్నారు.



వచ్చే నెలలో
ఎంబీబీఎస్ ప్రవేశాలు

- తుది దశకు కళాశాల భవన నిర్మాణం
- ఆగస్ట్ రెండో వారంలో ఎంబీబీఎస్ తరగతులు
- సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం

ఎన్ఎంసీ అనుమతులు

జిల్లా కేంద్రంలో వైద్య విద్యను బోధించే మెడికల్ కాలేజీని మంజూరు చేస్తూ నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) న్యూఢిల్లీ లెటర్ ఆఫ్ ఇన్‌టెంట్(ఎల్ఓటీ) నం.ఎస్ఎంసీ/యూజీ/2023- 2024/000033/ 021475 తేదీ: 21.0.4.2023ను జారీ చేసింది. కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల మెడికల్ కాలేజీకి వంద ఎంబీబీఎస్ సీట్లు కేటాయించారు. ఈ ఏడాది ఆగస్ట్ మొదటి వారంలో మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు జరగనున్నాయి. ఈ మేరకు నేషనల్ మెడికల్ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారికంగా మెడికల్ కాలేజీకి అనుమతి లభించింది.

ఎంబీబీఎస్ తరగతులకు శ్రీకారం

సిరిసిల్ల మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మొదటి ఏడాది తరగతులకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ ఏడాది వంద సీట్లు కేటాయించగా, ఇందులో 15 సీట్లు ఆలిండియా కోటాలో కేటాయిస్తారు. మరో 85 మన రాష్ట్ర అభ్యర్థులకు అవకాశం ఉంటుంది. 40 శాతం బాలురు, 60 శాతం సీట్లు బాలికలకు ఉంటాయి. ఆగస్ట్ మొదటి వారంలో కౌన్సెలింగ్ ఉంటుంది. సిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలో మొత్తం 340 బెడ్స్ సిద్ధం చేశారు. పెద్దూరు వద్ద నిర్మించిన సొంత భవనంలోనే ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభిస్తారు. హాస్టల్ భవనాలు నిర్మాణంలో ఉండగా, అబ్బాయిలు, అమ్మాయిల కోసం వేర్వేరు ప్రైవేటు భవనాలు సిద్ధం చేశారు.

సిరిసిల్లకు వచ్చిన ప్రొఫెసర్లు

సిరిసిల్ల మెడికల్ కాలేజీకి ప్రభుత్వం సిబ్బందిని కేటాయించింది. అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇతర సిబ్బంది కేటాయింపులు జరిగాయి. ఇప్పటికే 55 మంది సిబ్బందిని కేటాయించారు. మెడికల్ కాలేజీ ప్రారంభమైతే సుమారు వంద మంది డాక్టర్లు అందుబాటులో ఉంటారు. మొత్తంగా మెడికల్ కాలేజీలో సుమారు 700 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారు. ప్రస్తుతం జిల్లాకు వచ్చిన బోధన సిబ్బంది, ఇతర డాక్టర్లు జిల్లా ఆస్పత్రిలో సేవలు అందిస్తున్నారు.

సీఎంతో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

సిరిసిల్ల మెడికల్ కాలేజీని సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కోనరావుపేట మండలం మల్కపేట వద్ద కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ–9లో నిర్మించిన జలాశయం, జిల్లా పోలీస్ ఆఫీస్ భవనాన్ని సీఎం చేతుల మీదుగా ప్రారంభించాలని భావిస్తున్నారు. మెడికల్ కాలేజీ ప్రారంభంతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు జరగనున్నాయి. పట్టణంలోని జిల్లా ఆస్పత్రి పూర్తిస్థాయిలో మాతాశిశు సంరక్షణ, నవజాత శిశువుల కేంద్రంగా మారుతుంది. జనరల్ ఆస్పత్రి మొత్తంగా మెడికల్ కాలేజీకి మార్చడంతో పెద్దూరు శివారులోని మెడికల్ కాలేజీ బోధన ఆస్పత్రిగా ఉంటుంది. అన్ని రకాల వైద్యసేవలు, ఆధునిక పరికరాలతో అందుబాటులోకి వస్తుంది.



కళాశాల లోపలి భాగం

ఆగస్టులో తరగతులు..



రాజన్న సిరిసిల్ల మెడికల్ కాలేజీలో ఆగస్టులో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయి. భవన నిర్మాణ పనులు 80 శాతం మేర పూర్తయ్యాయి. మొదటి ఏడాది వైద్యపాఠాలు బోధించేందుకు మౌలిక వసతులు సమకూరాయి.

– డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్

‘ముసురు’కుంది

- తడిసి ముద్దయిన జిల్లా
- ఎల్లారెడ్డిపేటలో అత్యధికంగా 71.4 మి.మీ వర్షం
- బోయినపల్లిలో అత్యల్పంగా 32.7 మి.మీ
- పారిన నిమ్మపల్లి మూలవాగు
- అప్రమత్తమైన అధికారులు



తెల్లవారుజామునే సిరిసిల్లలో వర్షం

సిరిసిల్ల: జిల్లాను ముసురు వర్షం ముసురుకుంది. మంగళవారం తెల్లవారుజాము నుంచి ఓ మోస్తరు భారీ వర్షం కురుస్తూనే ఉంది. పొద్దంతా మేఘావృతమై తుంపర పడుతూనే ఉంది. ఎల్లారెడ్డిపేటలో అత్యధికంగా 71.4 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా బోయినపల్లిలో 32.7 మి.మీ కురిసింది. రుద్రంగిలో 33.0, చందుర్తి 61.9, వేములవాడ రూరల్ 35.6, వేములవాడ 41.5, సిరిసిల్ల 47.6, కోనరావుపేట 51.9, వీర్నపల్లి 39.3, గంభీరావుపేట 61.9, ముస్తాబాద్ 57.3, తంగళ్లపల్లి 61.6, ఇల్లంతకుంటలో 42.3 మి.మీ వర్షం కురిసింది. జిల్లాలోని అన్ని మండలాల్లో సగటున 49.1 మి.మీ వర్షం నమోదైంది. జిల్లాలో మంగళవారం నాటికి సాధారణ వర్షంతో పోల్చితే 9 శాతం మేరకు వర్షం లోటు ఉంది. తుపాను సూచనల నేపథ్యంలో ఇంకా భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్ వీధి వరద నీటి ప్రవాహంతో నిండిపోయింది. రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న ముసురువర్షంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. పాతబడిన ఇళ్లలో నివాసం ఉండవద్దని, కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న పూరిండ్లలో రాత్రివేళల్లో పడుకోవద్దని హెచ్చరించారు. ఆయా ప్రాంతాల్లో తహసీల్దార్లు, పోలీసులు క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తున్నారు. ముసురుతో వరినాట్లకు విఘాతం కలిగింది. ఇన్నాళ్లు వానలు లేక వరి నాట్లు వేయని రైతులు వర్షంలోనూ తడుస్తూ పొలాన్ని దున్ని, పాతం చేసి వరినాట్లు వేస్తున్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి మూలవాగులో వరద పారింది. వాగు వెంట ఉన్న చేతిబోర్ల మోటార్లు, పైపులను రైతులు బయటికి లాగారు. వర్షాలతో కొత్త నీరు చేరి డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

మళ్లీ తప్పని తిప్పలు



వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేట నక్కవాగుతో ఏటా వర్షాకాలంలో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. కొద్దిపాటి వర్షం వచ్చినా వాగులో నీరు పారుతోంది. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే రమేశ్‌బాబు రూ. 11.55 కోట్లు మంజూరు చేయించారు. టెండర్లు పూర్తి కాకపోవడంతో ఈ ఏడాది కూడా ఈ ప్రాంత ప్రజలకు కష్టాలు తప్పడం లేదు.

పొంగుతున్న లేతమామిళ్లవాగు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో మండలంలోని అక్కపల్లి శివారులో లేతమామిళ్లవాగు పొంగుపొర్లుతోంది. ఎల్లారెడ్డిపేట నుంచి వయా అక్కపల్లి మీదుగా కోనరావుపేట మండలానికి రాకపోకలు మంగళవారం నిలిచిపోయాయి. ఏటా వర్షాకాలంలో చిన్నపాటి వర్షాలకే వాగు పొంగిపొర్లుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారి గుండా రాకపోకలు నిలిచిపోతే సిరిసిల్ల లేదా కంచర్ల మీదుగా కోనరావుపేట మండలానికి అక్కడి ప్రజలు ప్రయాణం చేయాల్సి వస్తుంది. దీంతోపాటు అక్కపల్లికి, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి బంధం తెగిపోవడంతో ఆ గ్రామస్తులు వైద్యపరంగా అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ వంతెన నిర్మించాలన్న అక్కపల్లి గ్రామస్తుల విన్నపాలు బుట్టదాఖలయ్యాయి. దీంతో ఏటా వర్షాకాలంలో ఈ ప్రాంత ప్రజలకు వరద కష్టాలు తప్పడం లేదు.



గర్భిణులకు సత్వర సేవలందించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లటౌన్: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి వైద్యం పారదర్శకంగా అమలవుతుందని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం సిరిసిల్ల జిల్లాసుపత్రి, వేములవాడ ఏరియా ఆస్పత్రిని సందర్శించి మాట్లాడారు. ప్రసూతి వైద్యానికి వచ్చే గర్భిణులకు సత్వర సేవలు అందించాలని ఆస్పత్రుల ఇన్‌చార్జీలకు సూచించారు. పీఆర్‌వో వ్యవస్థ పూర్తిగా అమలయ్యేలా సూపరింటెండెంట్లు డాక్టర్ మురళీధర్‌రావు, డాక్టర్ మహేశ్‌రావు, డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్‌రావుకు సూచనలు చేశారు. గర్భిణులను నేరుగా కలిసి వైద్యసేవలపై విచారణ చేపట్టారు.

రోడ్డు వెంట మొక్కలు పెంచాలి

జిల్లా కేంద్రంలోని రగుడు– వెంకటాపూర్‌వరకు పూర్తయిన రెండో బైపాస్ రోడ్డు వెంట మొక్కలను ప్రణాళికబద్ధంగా నాటి సంరక్షించాలని కలెక్టర్ అన్నారు. రోడ్డువెంట హరితహారం కార్యక్రమం చేపట్టే అంశంపై క్షేత్రస్థాయి పరిశీలన జరిపి మాట్లాడారు. డివైడర్‌పై, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమంపై పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులకు సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, పంచాయతీరాజ్ ఈఈ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వారానికి మూడురోజులు డ్రై డే

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వారంలో మూడురోజులు డ్రై డే చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. డ్రై డే, శానిటేషన్ పనులపై మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని 17,18,19 వార్డుల్లో పర్యటించి మాట్లాడారు. వార్డుల్లో ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఏ ఇంట్లో నీటి నిల్వలు ఉండొద్దని ఆ దిశగా ప్రజలను చైతన్యులను చేయాలని మున్సిపల్, వైద్యశాఖ అధికారులకు సూచించారు. కాలనీల్లో ఎవరికైనా డెంగీ పాజిటివ్ వస్తే ప్రాథమిక కేంద్రం వైద్యులకు సమాచారం అందించాలన్నారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.




19వ వార్డులో డ్రై డే పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సిరిసిల్లటౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సీజనల్, కీటకజనిత వ్యాధుల నిర్మూలనపై వైద్యాధికారులతో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాంలో దోమలతో వ్యాధుల బారిన పడే అవకాశముందని, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 31వ వరకు డెంగీ నివారణ చర్యలు చేపట్టాలని, మంగళ, శుక్రవారాల్లో ప్రతి గ్రామం, పట్టణంలో డ్రై డే పాటించాలన్నారు. ఎవరైనా డెంగీ వాధికి గురైతే ట్రీట్‌మెంట్ చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీసం 80 శాతం వరకు ప్రసవాల సంఖ్య జరిగేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా పరీక్షలకు వచ్చే మహిళలకు ఒరల్, బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించాలన్నారు. డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు జరగొద్దు



మాట్లాడుతున్న డీఆర్డీవో మదన్‌మోహన్

వేములవాడరూరల్: గ్రామాల్లో అవకతవకలు జరగకుండా ఉపాధి హామీ పనులు జరగాలని అడిషనల్ డీఆర్‌డీవో మదన్‌మోహన్ అన్నారు. మంగళవారం వేములవాడ మండల పరిషత్‌లో ఎంపీపీ బండ మల్లేశం అధ్యక్షతన రెండో విడత సామాజిక తనిఖీ ప్రజావేదికపై సమీక్ష నిర్వహించారు. 2020 నవంబర్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనులపై తనిఖీ చేపట్టారు. వేములవాడ రూరల్ మండలంలోని 17 గ్రామాల్లో 1,236 పనులకు రూ.8,35,27,180 ఖర్చు పెట్టారు. వీటిపై ఆయన గ్రామాల వారీగా తనిఖీ చేపట్టారు. కాగా ఈ నెల 6 నుంచి 10 వరకు గ్రామాలవారీగా తనిఖీ చేసిన సొసైటీ ఆడిట్ టీం సభ్యులు గ్రామాల్లో జరిగిన పనుల వివరాలు, లోపాలను వివరించారు. చాలా గ్రామాల్లో అవకతవకలు జరిగిన దానిపై నివేదికలు అందజేశారు. అనంతరం అదనపు డీఆర్‌డీవో మాట్లాడుతూ, ఇక ముందు రికవరీ లేని గ్రామాలు ఉండాలన్నారు. వీటిపై పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు బాధ్యత వహించాలని సూచించారు. గ్రామాల్లో జరిగిన అవకతవకలపై ఉపాధి సిబ్బందికి రూ.6వేల జరిమానా విధించి, కొంత మంది నుంచి రూ.64,354 రికవరీ చేస్తున్నట్లు రికార్డులో నమోదు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్లు రామారావు, అరుణ్, ప్రకాశ్, ఎస్ఆర్పీ మహేష్, ఎంపీడీఓ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పడిన చెట్టు.. రాకపోకలకు అంతరాయం



దారిపై విరిగిపడిన చెట్టు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని శివంగాలపల్లి గ్రామం నుంచి అక్కపెల్లికి వెళ్లే దారిలో రోడ్డుపై చెట్టు విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. శివంగాలపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట మండలం అక్కపెల్లి బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయానికి రహదారి ఉంది. ఈ ఆలయానికి, ఎల్లారెడ్డిపేటకు రోజూ వాహనాలు వెళ్తుంటాయి. రోడ్డుపై చెట్టు విరిగిపడడంతో వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. సర్పంచ్ శివంగాల సురేశ్ ఆధ్వర్యంలో యువకులు చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

రైతును రాజు చేయాలన్నదే వైఎస్సార్ ఆకాంక్ష

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



కేసీఆర్, కేటీఆర్ ఫ్లెక్సీ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడ: రైతులను రాజు చేయాలన్నదే దివంగత మహానేత వైఎస్సార్ ఆకాంక్ష అని, ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసి రైతులకు ఉచిత కరెంటు అందించేందుకు ఫైల్‌పై తొలి సంతకం చేసిన విషయాన్ని బీఆర్ఎస్ నాయకులు మరిచారా..? అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. దేశం కోసం త్యాగాలు చేసిన కుటుంబం నుంచి వచ్చిన రాహుల్‌గాంధీని విమర్శించే హక్కు మంత్రి కేటీఆర్‌కు లేదన్నారు. రాహుల్‌కు ఎడ్లు తెల్వదు.. వడ్లు తెల్వదు అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకులు వేములవాడ రాజన్న గుడి ఎదుట సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఫ్లెక్సీలను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆది మాట్లాడుతూ, కేటీఆర్ మితిమీరిన మాటలు మాట్లాడుతున్నారని, వ్యవసాయం గురించి తెలవకుండానే రాహుల్‌గాంధీ ఇటీవల రైతులతో కలసి పొలంలో వరినాట్లు వేయలేదా, పొలం దున్నలేదా, రైతులతో కలిసి భోజనాలు చేయలేదా అంటూ నిలదీశారు. వ్యవసాయం దండగ అంటూ వ్యాఖ్యానించి, నాడు బషీర్‌బాగ్ కాల్పులకు కారణమైన చంద్రబాబు పక్కన కేసీఆర్ లేరా అని ప్రశ్నించారు. రైతులకు కల్లిబొల్లి కబుర్లు చెబుతూ 24 గంటలు నాణ్యమైన విద్యుత్ అందజేస్తున్నామంటూ చెప్పుకోవడం హాస్యాస్పదం అన్నారు. కార్యక్రమంలో వకులాభరణం శ్రీనివాస్, చిలుక రమేశ్, కూరగాయల కొమురయ్య, కనికరపు రాకేశ్, లింగంపల్లి కిరణ్, కరుణాకర్, సంగస్వామి, పాత సత్యలక్ష్మి, తోట లహరి, నాగుల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వర్షాలకు అప్రమత్తంగా ఉండండి


ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గంలోని ప్రజలంతా అప్రత్తంగా ఉండాలని, పంట చేనుల వద్దకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే రమేశ్‌బాబు, డీఎస్పీ నాగేంద్రచారి మంగళవారం విజ్ఞప్తి చేశారు. వాతావరణశాఖ సూచనలు పాటిస్తూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు, చిన్నారులు చెరువులు, కుంటల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలపై దృష్టి సారించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు, రైతులు రెయిన్ కవర్లు ధరించాలని, లోతట్టు ప్రాంతాల్లో ఉండే జనం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడమే కాకుండా వారి సహకారం తీసుకోవాలన్నారు.

కేంద్ర విధానాలపై కార్మికులు పోరాడాలి


మాట్లాడుతున్న రాములు

సిరిసిల్లఅర్బన్: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, దీనిపై కార్మికులందరూ పోరాడాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని కార్మిక భవన్‌లో జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆగస్టు 9,10 తేదీ ల్లో అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ధర్నాలో రైతులు, హమాలీలు, భవన నిర్మాణ, పవర్‌లూమ్, బీడీ, తదితర కార్మిక సంఘాల నా యకులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు లక్ష్మణ్, రుక్మిణి తదితరులు ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


కేజీబీవీ గేటు ఎదుట నీటిగుంత

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి కేజీబీవీ పాఠశాల గేటు ఎదుట మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో ఏర్పడ్డ పెద్ద నీటి గుంతతో ప్రమాదం పొంచి ఉంది. రైతువేదిక భవనంలోకి నీటి సౌకర్యం కల్పించడానికి కేజీబీవీ గేటు పరిసరాల నుంచి ఇటీవల పైప్‌లైన్ వేశారు. గేటు పరిసరాల్లో పైప్‌లైన్ లీకేజీతో పెద్ద గుంత ఏర్పడింది. విద్యార్థినులు ఎవరైనా అదుపుతప్పి అందులో పడే అవకాశం ఉంది. ఈ విషయంపై కేజీబీవీ ఎస్‌ఓ పద్మ మాట్లాడుతూ, నీటి గుంతతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని త్వరగా మరమ్మతు చేయించాలని ఎంపీడీఓ రాజేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వర్షాలు పడుతుండడంతో మరమ్మతులు చేయడంలో ఆలస్యం అవుతున్నట్లు వివరించారు.

రోడ్డు విస్తరణకు రూ.30 కోట్లు

- ఇటీవల మంజూరు చేసిన ప్రభుత్వం
- ఫోర్‌లేన్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, డివైడర్లు
- గంభీరావుపేటలో తీరనున్న ట్రాఫిక్ సమస్యలు


ఫోర్‌లేన్‌గా మారనున్న గంభీరావుపేట రోడ్డు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండల కేంద్రం త్వరలో కొత్త శోభను సంతరించుకోనుంది. మండలకేంద్రంలో రోడ్డు విస్తరణ, ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణానికి ఎట్టకేలకు ఇటీవల రూ.30కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులు పూర్తయితే రూపురేఖలు మారనున్నాయి. డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ కూడా ఏర్పాటు చేయనున్నారు.

80 ఫీట్ల రోడ్డుకు తీర్మానం

- రోడ్డు వెడల్పునకు గ్రామపంచాయతీ ఇప్పటికే 80 ఫీట్లకు తీర్మానం చేసి అక్కడక్కడా కూల్చివేతలు చేపట్టింది. నిధులు లేక పనులు ముందుకు సాగడం లేదు. డ్రైనేజీ దాటి నిర్మించిన నిర్మాణాలను తొలగించారు.
- దీంతో దుకాణాల్లోకి వెళ్లడానికి యజమానులు బల్లాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈక్రమంలో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రస్తుతం నిధులు మంజూరు కావడంతో రోడ్డు విస్తరణపై ప్రజలకు ఆశలు చిగురించాయి.
- మండలకేంద్రంలోని ప్రధాన రహదారి గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటు కామారెడ్డి అటు సిరిసిల్ల, సిద్దిపేట పట్టణాలకు బస్సులు, ఇతర వాహనాలు వెళ్తుంటాయి. దీంతో రోడ్డు రద్దీగా ఉంటుంది. రోడ్డు ఇరుకుగా ఉండడం, పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకైన రోడ్డుతో తరచూ ప్రమాదాలు జరుగుతుండేవి. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో రోడ్డు విస్తరణ, ఫోర్‌లైన్ రోడ్డు నిర్మిస్తే మండలకేంద్రంలో ట్రాఫిక్ సమస్య తీరనుంది.
- గంభీరావుపేట– లింగన్నపేట ప్రధాన రహదారికి దాదాపు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ, నాలుగు వరుసల రోడ్డు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయనున్నారు. అభివృద్ధి పనులతో గంభీరావుపేట వ్యాపార కేంద్రంగా మారనుంది.

కేటీఆర్ కృషి వల్లే..



మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ, కృషి వల్లే గంభీరావుపేటలో రోడ్డు విస్తరణ, నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అందుకు కేటీఆర్‌కు మా గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. అలాగే టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు సహకారానికి కృతజ్ఞతలు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి.
– కటకం శ్రీధర్ పంతులు, సర్పంచ్, గంభీరావుపేట

కల నెరవేరనుంది



గంభీరావుపేటలో రోడ్డు విస్తరణ, ఫోర్‌లైన్ రోడ్డు కావాలనేది ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేరనుంది. నిధులు మంజూరు చేయించిన మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు. త్వరగా పనులు చేపట్టి పూర్తి చేయాలి.
– చిట్టంపల్లి భిక్షపతి, గంభీరావుపేట

ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి చేయూత

- ఆరేళ్ల చదువు ఖర్చులు బ్యాంక్ అకౌంట్‌లో జమచేస్తామన్న ట్రస్టు
- తక్షణ అవసరాలకు రూ.11,200 ఆర్థికసాయం


తనుష్క

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నిరుపేద విద్యార్థిని ఉన్నత చదువులకు దాతలు వరుసగా స్పందిస్తూ చేయూతనందిస్తున్నారు. ఈ క్రమంలోనే ఓ స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చి ఆరేళ్ల చదువు ఖర్చులను విద్యార్థిని బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తామని, తక్షణంగా ఖర్చుల కోసం రూ.11,200 మంగళవారం బ్యాంక్ అకౌంట్‌లో జమ చేసి ఉదారత చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకొని 9.7 జీపీఏతో పాటు బాసర ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించిన కెమ్మసారపు తనుష్క కడుపేదరికం అనుభవిస్తుంది. ఉన్నత చదువులకు పేదరికం అడ్డుగా మారడంతో సమాచారం అందుకుంటున్న దాతలు ముందుకు వచ్చి ఇప్పటివరకు రూ.60వేల వరకు సాయం అందించారు. తాజాగా సిరిసిల్లకు చెందిన ఆర్‌జీ రావు ట్రస్టు మేనేజర్ రాజేశ్ మంగళవారం రూ.11,200 తనుష్క అకౌంట్‌లో జమ చేశారు. అలాగే విద్యార్థి 6 సంవత్సరాల చదువుకు ప్రతి నెలా డబ్బులు అకౌంట్ జమ చేస్తామని చెప్పడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు గొట్టిముక్కల శేఖర్ తెలిపారు. దీంతో పాటు ఇదే పాఠశాలకు చెందిన పులి మనస్కంత్‌కు పదో తరగతిలో 9.3 జీపీఏ రాగా అతడి ఇంటర్ చదువుతో పాటు జేఈఈ మెయిన్స్, ఎంసెట్, బిట్స్ నందు ఉచిత శిక్షణకు పూర్తి ఖర్చులు ఇస్తామని ట్రస్టు తెలిపినట్లు హెచ్‌ఎం చెప్పారు. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయుడు సలాఉద్దీన్‌ను అభినందిస్తూ, ట్రస్టు చైర్మన్ బొంతు దామోదర్‌రావు, మేనేజర్ రాజేశ్‌కు శేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

కేసు నమోదు

సిరిసిల్లక్రైం: ఆర్టీసీ బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్న జీడిపల్లి రత్నాకర్‌రెడ్డి సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. కామారెడ్డికి చెందిన రత్నాకర్‌రెడ్డి వేములవాడ బస్సు డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 16న కామారెడ్డి వెళ్లడానికి సిరిసిల్ల పాతబస్టాండ్‌లో బస్సు కోసం చూస్తుండగా దొంగలు అతడి ఫోన్ దొంగలించారు. అంతేకాకుండా అతడి ఫోన్‌కు లింకు ఉన్న బ్యాంకు ఖాతాల నుంచి రూ.1.94 లక్షలు నిందితుడు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ఈ నెల 17న రాత్రి ఫిర్యాదు చేయడంతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ట్రాక్టర్ బోల్తా.. తప్పిన ప్రమాదం


బోల్తాపడిన ట్రాక్టర్

వీర్నపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన రైతు చొప్పరి మోహన్ తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్‌ను ఒడ్డు దించే క్రమంలో బోల్తా పడింది. గత రెండు రోజులుగా వర్షం పడడంతో బురదమయం అయ్యి ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, ట్రాక్టర్ డ్యామేజ్ అయినట్లు మోహన్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్రె మృతి


మృతిచెందిన గొర్రె వద్ద కాపరి

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు శివారులోని అపెరెల్ పార్క్ సమీపంలో మంగళవారం విద్యుదాఘాతంతో గొర్రె మృతిచెందింది. గ్రామానికి చెందిన గొర్లకాపరి సలేంద్రి దేవయ్య గొర్ల మందను అపెరెల్ పార్క్ వైపు మేతకు తీసుకెళ్లాడు. రాత్రి నుంచి వర్షం కురవడంతో విద్యుత్ స్తంభం విరిగిపడి, తెగిపడిన తీగలు తగలడంతో గొర్రె అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో అప్రమత్తమైన గొర్ల కాపరి మిగతా గొర్రెలు అటువైపు వెళ్లకుండా కాపాడాడు. అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని బాధితుడు వేడుకున్నాడు.

సంచార జీవులకు ఓటుహక్కు కల్పించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి


మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని, సంచార జీవనం సాగించే వారిని సైతం ఓటర్లుగా నమోదు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఫొటో ఎలక్టోరల్ రోల్స్ 2వ ఎస్ఎస్ఆర్ 2023పై అధికారులతో సమీక్షించారు. పారదర్శకంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని, చనిపోయినవారిని తొలగించే క్రమంలో మరణ ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలన్నారు. దివ్యాంగుల కోసం ర్యాంపులు విధిగా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్, ఆర్డీవో పి.పవన్‌కుమార్, తహసీల్దార్లు విజయ్‌కుమార్, రాజు, అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్లు ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

భక్తితోనే ముక్తి


భక్తులకు ప్రవచనాలు వినిపిస్తున్న వేణుగోపాలచార్య కౌశిక

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): లోకరక్షకుడు భగవంతుడని, భక్తితోనే ప్రతి ఒక్కరికి ముక్తి లభిస్తుందని జగిత్యాల శ్రీ మాన్‌నంబి వేణుగోపాలచార్య కౌశిక అన్నారు. మండల కేంద్రంలోని సత్సంగ సదనంలో శ్రీ శోభకృత్ సంవత్సర అధిక శ్రావణ పురుషోత్తమ మాస దివ్య ప్రబోధ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం సర్వపురాణ సారం శ్రీవిష్ణు సహస్రనామ వైభవ ప్రవచనాలను భక్తులకు వినిపించారు. నిత్య జీవితంలో కొంత సమయాన్ని దేవుని నామస్మరణకు కేటాయించాలని సూచించారు. సత్సంగ సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి ప్రభాతభేరి, గీతాపారాయణం, సూర్య నమస్కార కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమానికి భక్తులు తరలివచ్చారు.

హత్య కేసులో తల్లీకూతురు అరెస్టు


హంతకుల అరెస్టు చూపుతున్న పోలీసులు

ధర్మపురి: మండలంలోని నేరెల్ల గ్రామానికి చెందిన దాసండ్ల మాణిక్యం(40 హత్య కేసులో అతని తల్లి, అత్తను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రమణమూర్తి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం .. మాణిక్యం నిత్యం మద్యం సేవిస్తూ తన భార్యను వేధించేవాడు. దీంతో ఈ నెల 16న రాత్రి నిద్రిస్తున్న సమయంలో మాణిక్యంపై అతని భార్య జమున, అత్త నమిలికొండ శాంతవ్వ కర్రలతో విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి భూమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. హంతకులైన తల్లీకూతురును మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు దత్తాత్రి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


అజ్మీరా భాస్కర్ (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని అజ్మీరాతండా (వట్టిమల్ల)కు చెందిన యువకుడు కరీంనగర్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల వివరాలు.. అజ్మీరాతండా (వట్టిమల్ల) గ్రామానికి చెందిన అజ్మీరా రాంరెడ్డి–జయ దంపతుల కుమారుడు భాస్కర్ స్థానికంగా ఇంటర్ వరకు చదివి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేసుకుంటూ అక్కడే ఉంటున్నాడు. అతడి సోదరి హారిక కూడా మరో ఆస్పత్రిలో పనిచేస్తూ కుటుంబంతో కలిసి ఉంటుంది. మంగళవారం మధ్యాహ్నం భాస్కర్ అద్దెకు ఉంటున్న గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. ప్రేమ వ్యవహారమే కారణమని పలువురు భావిస్తున్నారు. మృతుని తండ్రి రాంరెడ్డి గల్ఫ్‌లో ఉంటున్నాడు.

వృద్ధురాలి అదృశ్యం


లక్ష్మీరాజమ్మ

గొల్లపల్లి: ఓ వృద్ధురాలు ఇంట్లో చెప్పకుండా వెళ్లి, కనిపించకుండా పోయింది. ఈ సంఘటన గొల్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లొత్తునూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. లొత్తునూర్‌కు చెందిన తౌటు లక్ష్మీరాజమ్మ ఈ నెల 6వ తేదీన చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల గ్రామాల్లో గాలించారు. ఆచూకీ లభించక పోవడంతో ఆమె కుమారుడు మంగళవారం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.




అధ్వానంగా తరగతి గదులు

వేములవాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతి గదులు అధ్వానంగా మారాయి. కిటికీలు, తలుపులు విరిగిపోయి జంతువులు లోనికి ప్రవేశిస్తున్నాయని స్థానికులు తెలిపారు. అవసరం లేకున్నా లైట్లు వేసి ఉంచుతూ విద్యుత్ వృథా చేస్తున్నారని పేర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో స్ట్రాంగ్‌రూమ్‌గా వాడుకునే ఈ గదులు నేడు ఈ దుస్థితిలో ఉండటం ఏమిటంటూ జనం వాపోతున్నారు.

కుంట కాదు.. కాలేజీ గ్రౌండ్



వేములవాడ: ఈ చిత్రంలో కనిపిస్తున్నది కుంట కాదు.. సాక్షాత్తు కాలేజీ గ్రౌండ్. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద చేరి ఇలా మారింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోకి వస్తున్న వరద బయటికి వెళ్లకుండా ఇలాగే ఉండిపోతుందని, కొద్ది రోజులుగా అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని కాలేజీ సిబ్బంది, వాకర్స్ వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు ఈ గ్రౌండ్‌పై దృష్టి సారించాలని వాకర్స్ కోరుతున్నారు.

శంకుస్థాపనకే పరిమితం

- మరిమడ్ల– మానాల రహదారికి రూ.9 కోట్లు
- మూడునెలల క్రితం శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రమేశ్‌బాబు
- వర్షాకాలమొచ్చినా మొదలుకాని పనులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు(ఫైల్)


అధ్వానంగా తయారైన మరిమడ్ల–మానాల రహదారి

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలం మరిమడ్ల నుంచి రుద్రంగి మండలం మానాల వరకు రెండు మండలాలను కలిపే దారికి మోక్షం కలగడంలేదు. రహదారి పనులకు నిధులు మంజూరై ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మూడునెలలు అవుతున్నా ఇప్పటివరకు ముందుకు సాగడంలేదు. దీంతో రెండు మండలాల ప్రజల రహదారి సమస్య పరిష్కారానికి నోచుకోవడంలేదు.

ముందుకు సాగని పనులు

మండలంలోని మరిమడ్ల నుంచి మానాల వరకు గల రహదారి పనులకు రూ.9 కోట్లు మంజూరయ్యాయి. వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు మే1న పనులకు శంకుస్థపన చేశారు. ఈ నిధులతో మరిమడ్ల నుంచి మానాల వరకు 4కిలోమీటర్ల దూరం తారురోడ్డు వేయాలి. కానీ ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు.

తగ్గనున్న దూరభారం

మరిమడ్ల నుంచి రుద్రంగి మండలం మానాల వరకు 10 కిలోమీటర్ల దూరం ఉంటుంది. మామూలు రోజుల్లో ద్విచక్రవాహనాలు వెళ్తుంటాయి. వర్షాకాలం వచ్చిందంటే రోడ్డంతా బురదమయంగా తయారై నడవడానికి కూడా వీలులేకుండా తయారవుతోంది. ఈ రోడ్డు మీదుగా ప్రయాణించలేని వారు సనుగుల– రుద్రంగి మీదుగా వెళ్లాల్సి వస్తుంది. ఇదే రోడ్డులో ఉన్న సనుగుల చెరువు నిండితే ఈ దారి నుంచి కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో హన్మాజీపేట, మూడపెల్లి గ్రామాల మీదుగా వెళ్లాలంటే సుమారు 60– 70 కిలోమీటర్ల దూరం ఉంటుంది.

పనులు పూర్తయితే ప్రయోజనం



మరిమడ్ల–మానాల రహదారి రెండు మండలాల ప్రజలకు అత్యంత ముఖ్యమైనది. వర్షాకాలంలో వాహనదారుల వేదన వర్ణనాతీతంగా ఉంటుంది. ఈ దారిని తారురోడ్డుగా మారుస్తామని మంత్రి ప్రశాంత్‌రెడ్డి హామీ ఇచ్చి సంవత్సరాలు అవుతున్న నెరవేరడంలేదు.
– బానోత్ నరేశ్‌కుమార్, లైవ్ జిల్లా అధ్యక్షుడు

వర్షాకాలం తీవ్ర ఇబ్బందులు



మరిమడ్ల నుంచి మానాలకు వెళ్లాలంటే ఇది దగ్గరి దారి. వర్షాకాలం రహదారి మొత్తం బురదమయంగా తయారవుతుంది. మిగతా రోజుల్లో ద్విచక్రవాహనాలు వెళ్లడానికి వీలవుతున్నా, వర్షాకాలంలో మాత్రం నడవలేని విధంగా తయారవుతుంది. అధికారులు స్పందించి రహదారిని త్వరగా పూర్తి చేయాలి.
– కుమ్మరి దిలీప్‌కుమార్, మరిమడ్ల

త్వరలో ప్రారంభిస్తాం



కొన్ని కారణాల వల్ల కోనరావుపేట మండలం మరిమడ్ల– మానాల రోడ్డు పనుల్లో జాప్యం అయింది. వర్షాకాలం ప్రారంభమైనా రహదారి పనులు తొందరలోనే ప్రారంభిస్తాం. రెండు మండలాల ప్రజల రహదారి సమస్య తీరుస్తాం.
– సతీశ్, ఏఈ, రోడ్లు భవనాల శాఖ

శీత్లాభవాని వేడుకలు




ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గిరిజనుల ఆరాధ్యదైవం శీత్లాభవాని వేడుకలను మంగళవారం ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో మంత్రి కేటీఆర్ ఇచ్చిన స్థలంలో గిరిజనులంతా కలిసి వేడుకలు జరుపుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడు భూక్య దేవీలాల్‌నాయక్, సర్పంచ్‌లు శంకర్‌నాయక్, సునీత, సూర్యానాయక్, సీత్యానాయక్, తిరుపతినాయక్, మహిళలు పాల్గొన్నారు.